ప్రజాశక్తి
బుధవారం 21 డిసెంబర్ 2022 8 పేజీలు
గుంటూరు పల్నాడు

మలుపు తిరిగిన మాచర్ల ఘటన

- వైసిపి కార్యకర్త చల్లా మోహన్‌పై వీడియో విడుదల
- పోలీసుల ఎఫ్ఐఆర్‌లపై న్యాయపోరాటం : టిడిపి
- మాచర్లలో 144 సెక్షన్ పొడిగింపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మాచర్ల అల్లర్ల ఘటన మంగళవారం మరో మలుపు తిరిగింది. మాచర్లలో ఈనెల 16న జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఇప్పటి వరకు టిడిపి వారు దాడి చేస్తున్నట్టు వీడియోలు మాత్రమే బయటకు రాగా తాజాగా వైసిపి కార్యకర్త, రేషన్ డీలరు చల్లా మోహన్ కత్తి (తల్వార్)తో టిడిపి నాయకులను చంపుతానంటూ చెబుతున్న మాటలతో కూడిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వీడియోను ప్రదర్శిస్తూ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి నాయకులను చంపేందుకు కత్తిపట్టుకుని తిరుగుతున్న చల్లా మోహన్ నుంచి ఫిర్యాదు తీసుకుని తమ టిడిపికి చెందిన జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు 24 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. బ్రహ్మారెడ్డితో పాటు పలువురు టిడిపి నాయకులను హతమార్చేందుకు చల్లా మోహన్‌తోపాటు మరికొందరు ప్రయత్నించినట్టు ఆరోపణలున్నా తమ పార్టీ నాయకులు ప్రతిఘటించిన ఒక వీడియోను ఆసరగా చేసుకుని వెల్దుర్తి మండలానికి చెందిన ఫ్యాక్షన్ నాయకుల వల్లే అల్లర్లు జరిగాయని పోలీసు అధికారులు ప్రకటించడాన్ని టిడిపి నాయకులు తప్పుపడుతున్నారు. వాస్తవాలకు భిన్నంగా పోలీసు అధికారులు ఏక్షపక్షంగా వ్యవహరించారని వారు ఆరోపిస్తున్నారు.

చల్లా మోహన్ వీడియో బహిర్గతం కావడంతో పోలీసు అధికారులు, వైసిపి నాయకులు ఆత్మరక్షణలో ఉన్నారు. ఈ వీడియో అధికారుల నుంచి స్పందన రాలేదు. మాచర్లలో ఈనెల 16న టిడిపి, వైసిపి మధ్య తొలుత జరిగిన ఘర్షణల ▶ 2లో

25వ తేదీ వరకూ 144 సెక్షన్

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో గత శుక్రవారం వైసిపి-టిడిపి శ్రేణుల మధ్య హింసాత్మక ఘర్షణలో పెద్ద ఎత్తున ఆస్తినష్టం వాటిల్లింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పట్టణంలో శనివారం నుండి 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. తొలి గడువు మంగళవారంతో ముగియగా తాజా పరిస్థితుల నేపథ్యంలో దీన్ని ఈనెల 25వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులను తహశీల్దార్ జారీ చేశారని పట్టణ సిఐ తెలిపారు.

వాహనంలోని మమోగ్రఫి వైద్య పరికరాన్ని పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

కేన్సర్ బాధితుల గుర్తింపు కోసం పరీక్షలు

- నిర్ధారణైన వారికి ఉచితంగా వైద్యం : మంత్రి విడదల రజిని
- మమోగ్రఫీ స్క్రీనింగ్ బస్సుకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం, విఆర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని 30వ వార్డు పురుషోత్తపట్నంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మమోగ్రఫీ కేన్సర్ స్క్రీనింగ్ బస్సును పైలెట్ ప్రాజెక్టుగా మంత్రి మంగళవారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వారం రోజుల నుంచి 1654 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, అపోలో సంస్థ బస్సు ద్వారా 125 మంది అనుమానిత కేసులుగా వచ్చిన వారికి మమోగ్రఫి ద్వారా ఏ దశలో ఉందో నిర్ధారించి వైద్యం చేయిస్తామని వివరించారు. నాదెండ్ల మండలంలో 497 మందికి పరీక్షలు చేయగా 15 అనుమానిత కేసులను గుర్తించామని, యడ్లపాడు మండలంలో 560 మందికి పరీక్ష చేయగా 48 అనుమానిత కేసులు కావూరు పిహెచ్‌సి పరిధిలో 597 మందికి గాను 35 అనుమానిత కేసులు వచ్చినట్లు తెలిపారు. వీరందరికీ ప్రస్తుతం పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి ఏ దశలో ఉందో నిర్ధారించి పూర్తిస్థాయిలో నిర్ధారణైనవారికి ఉచితంగా ▶ 2లో

లోపలి పేజీల్లో వార్తలు...

డ్వాక్రాల వద్ద అక్రమ వసూళ్లపై ఐద్వా ఫిర్యాదు

పంట నష్టం అంచనాలపై లోపభూయిష్ట ఉత్తర్వులు

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు

రెవెన్యూ, పోలీస్ సమస్యలే ఎక్కువగా వస్తున్నాయ్

నరసరావుపేటలో వృద్ధుని దారుణ హత్య

తనకు, పార్టీకీ సంబంధం లేదన్న ఎమ్మెల్యే

ప్రాణాలు తీసిన రోడ్డు ప్రమాదాలు

- రెండు జిల్లాల్లో నలుగురు దుర్మరణం, పలువురికి గాయాలు
- సిటీస్కాన్‌కు డబ్బు లేక వలస కార్మికుడు మృతి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాటిల్లిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యు వాత పడగా పలువురు గాయపడ్డారు. గుంటూరు జిల్లా మేడికొండూరు, తెనాలి మండలాలు, పల్నాడు జిల్లా మాచర్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో ఈ ప్రమాదాలు జరిగాయి.

మేడికొండూరు మండలంలో వాటిల్లిన ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయి మృతిచెందిన తియ్యగూర కిరణ్‌రెడ్డి

ప్రజాశక్తి- మేడికొండూరు

రోడ్డుపై వేగంగా వెళుతున్న కారు, అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొని పక్కకు పడిపోయింది. కారులో నుండి బయటకు వచ్చేందుకు వీలు లేకపోవడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని పేరేచర్ల - సత్తెనపల్లి రోడ్డులోని హరియాలి పెట్రోల్ బంకు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పల్నాడు జిల్లా, చిలకలూరిపేట పట్టణంలోని సన్యాసివారివీధికి చెందిన తియ్యగూర కిరణ్‌రెడ్డి (40) గుంటూరు సమీపంలోని మిర్చి యార్డ్‌లో సూపర్వైజర్‌గా పని చేస్తుంటాడు. గుంటూరు నుండి సత్తెనపల్లి వైపు కారులో ప్రయాణిస్తుండగా హరియాలీ పెట్రోల్ బంకు సమీపంలో వేగ నియంత్రణ కోల్పోయిన కారు.. రోడ్డు ▶ 2లో

మలుపు తిరిగిన మాచర్ల ఘటన

(మొదటి పేజీ తరువాయి)

తరువాత వైసిపి వారు యధేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. విధ్వంసం జరిగిన తీరుపై ప్రజల్లో భయానక వాతావరణం అలుముకుంది. ఘర్షణ ఒకెత్తయితే విధ్వంసం జరిగిన తీరుపై ప్రభుత్వం, పోలీసు నిర్లిప్తతపైనా విమర్శలు వచ్చాయి.

మరోవైపు మాచర్ల పట్టణంలో ఈనెల 17న విధించిన 144 సెక్షన్‌ను అధికారులు 25 వతేదీ వరకు పొడిగించారు. విధ్వంసంలో నష్టపోయిన టిడిపికి చెందిన బాధితులను పరామర్శించేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పలువురు రాష్ట్ర జిల్లా నాయకులు రాకుండా ఉండేందుకు వారి పర్యటనలకు ఆంక్షలు విధించేందుకు 144 పొడిగించినట్లు టిడిపి నాయకులు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా అల్లర్లు, విధ్వంసం ఘటనల్లో వివరాలు సేకరించే పనిలో మాచర్ల పోలీసులు నిమగ్నమయ్యారు. టిడిపికి చెందిన 24 మందిపై కేసులు నమోదు చేశారు. కొంత మందిని అదుపులోకి తీసుకుని మూాడ్రోజుల నుండి వేర్వేరుగా విచారిస్తున్నారు. దాదాపు 20 మంది వరకు పరారీలో ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నారు. హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్నవారి వివరాలు చెప్పాలని వత్తిడి చేస్తున్నారు. హత్యాయత్నం కేసులో ఎ-1గా ఉన్న టిడిపి మాచర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తారా? కోర్టులో లొంగిపోతారా? అనేది ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

వైసిపి వారి విధ్వంసంలో నష్టపోయిన బాధితులను పరామర్శించేందుకు చంద్రబాబు నాయుడు త్వరలో మాచర్లకు రానున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒక వేళ పోలీసులు అనుమతి ఇవ్వకపోతే ఆయన హైకోర్టును ఆశ్రయించనున్నారని తెలిసింది. యరతిపతినేని శ్రీనివాసరావు విడుదల చేసిన వీడియో ఆధారంగా మాచర్ల పోలీసులు జారీ చేసిన ఎఫ్ఐఆర్‌లపై టిడిపి నాయకులు హైకోర్టులో సవాల్ చేయనున్నారు. చల్లా మోహన్ కత్తిపట్టుకున్న కూర్చున్న వీడియో ఆధారంగా ఆయనకు ఈ ఘటనలో ఫిర్యాదు చేసే నైతిక హక్కులేదని ఈ కేసును రద్దు చేయాలని క్వాషింగ్ పిటీషన్ దాఖలు చేసే యోచనలో టిడిపి నాయకులు ఉన్నారని తెలిసింది. మొత్తంగా న్యాయపోరాటం కోసం టిడిపి నాయకులు ఇప్పటికే న్యాయ నిపుణులతో చర్చిస్తున్నారు.

కేన్సర్ బాధితుల గుర్తింపు కోసం పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స అందిస్తామని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కేన్సర్ బాధితుల వైద్యానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసిందని, ఆరోగ్యశ్రీలో 400 పైగా వ్యాధులను చేర్చామని చెప్పారు. నియోజకవర్గాన్ని హెల్దీ చిలకలూరిపేటగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పేదలంతా ఉపయోగించుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని వైద్యపరికరాలు తెప్పించి అనేక మందికి పరీక్షలు చేయిస్తామని, నరాలు, షుగర్, కిడ్నీ తదితర రోగాలకూ పరీక్షలు చేసి, ఉచితంగా చికిత్స అందిస్తామని మంత్రి వివరించారు. ఇందులో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది కొద్ది నెలలుగా పూర్తిస్థాయి సర్వే చేస్తున్నారని, త్వరలోనే న్యూరో ఆన్ వీల్స్ పేరుతో నరాల సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (జిడిసిసిబి) చైర్మన్ ఆర్.సీతారామాంజనేయులు, ఇతర అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన రోడ్డు ప్రమాదాలు

(మొదటి పేజీ తరువాయి)

పక్కనే ఉన్న చెట్టును ఢీకొని తల్లకిందులుగా రోడ్డుపక్కకు పడిపోయింది. కారు పూర్తిగా ధ్వంసం అవడంతో కారులోని కిరణ్‌రెడ్డి లోపల ఇరుక్కుపోయాడు. గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లి రక్షించే ప్రయత్నం చేయగా డోర్లు రాలేదు. దీంతో పేరేచర్ల నుండి గ్యాస్ కట్టర్‌ను పిలిపించి కట్ చేసి డోర్లు తెరిచారు. అప్పటికే కిరణ్‌రెడ్డి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు అవివాహితుడని సమాచారం.

మాచర్ల: పట్టణ శివారు ప్రాంతంలో రాయవరం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనం, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పాత మాచర్లకు చెందిన ఉప్పుతోళ్ల అనిల్ (29) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు మాచర్ల నుండి గుంటూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుంటూరు వైపు నుండి మాచర్ల వస్తున్న ఆర్టీసీ బస్సు రాయవరం జంక్షన్ వద్ద ఢీకొట్టింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అవివాహితుడైన అనిల్ లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. గుంటూరు రోడ్డులో ఉన్న లారీ ఆఫీస్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు సమాచారం.

నాదెండ్ల :ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని సాతులూరులో హైస్కూల్ ఎదురు చెరువు వద్ద చోటుచేసుకుంది. నకరికల్లు మండలం చేజర్లకు చెందిన కె.అబ్రహాం డీజే ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. ఓ ప్రోగ్రాం నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళ్తున్నాడు. సాతులూరి చెరువు వద్దకు రాగానే గుంటూరు వైపు నుండి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వేంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలిని పరిశీలించిన ఎస్ఐ ఎ.భాస్కరరావు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

యడ్లపాడు:రోడ్డు ప్రమాదంలో గాయపడి వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన టూఫాన్‌స్వైన్ (37) కొద్దికాలంగా తిమ్మాపురంలోని కృష్ణమూర్తి నూలుమిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి వ్యక్తిగత పనులపై చిలకలూరిపేటకు వెళ్లేందుకు ఆటో కోసం రోడ్డుపై నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో నాదెండ్ల నుంచి తిమ్మాపురం వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టడంతో పడిపోయాడు. ఒంటిపై గాయాలేమీ కనిపించకున్నా తల మొద్దు బారినట్లుగా ఉండటంతో చిలకలూరిపేటలోని ఆస్పత్రికి వెళ్లాడు. ప్రాథమిక చికిత్సలు చేసి వైద్యులు తలకు సిటీస్కాన్ రాయడంతో డబ్బుల్లేక తిరిగి వచ్చేశాడు. మరుసటి రోజు సిటీస్కాన్ సెంటర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఎస్ఐ పి.రాంబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కృష్ణా జిల్లా మోపిదేవిలోని ఆలయానికి కారులో వెళ్లిన నలుగురు తిరుగు పయణమయ్యారు. పెదరావూరు శివారు ప్రాంతానికి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టి పక్కనే వున్న పంట కాల్వలో తమ కారు బోల్తా పడింది. కారులో నలుగురుండగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై ఉన్నవారితోపాటు పక్కనే వెళ్తున్న పలు ద్విచక్ర వాహనదారులు కూడా తమ వాహనాలపై నుంచి క్రిందకిపడినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ద్విచక్రవాహనంపై వెళుతున్న వారిని తెనాలి డొంక రోడ్డుకి చెందిన శశి, సాయిగా గుర్తించారు. గాయలపాలైన మరొవ్యక్తి కొల్లూరు మండలం చింతల్లంకలో పాస్టర్ పురుషోత్తం. తెనాలిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు పురుషోత్తం తెలిపారు.

తెనాలిలో..

నాదెండ్లలో..

మాచర్లలో..

క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పోలీసులకు ప్రశంసలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రీడలలో ప్రతిభకనబరిచి పతకాలు సాధించిన గుంటూరు పోలీసు సిబ్బందిని ఎస్పి ఆరీఫ్ హఫీజ్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 17, 18, తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ 41 అథ్లెటిక్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన వివిధ రకాల పోటీలలో గుంటూరు జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అసోసియేషన్ సెక్రెటరీ సిహెచ్ కొండయ్యవారి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పోలీస్ టీం పోటీలో పాల్గొని పతకాలు సాధించారు. పతకాలు సాధించిన ఎఆర్ కానిస్టేబుల్ జె.నాగరాజు 10 కిలో మీటర్ల పరుగు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. హోంగార్డు కృష్ణ కిషోర్ ఐదు కిలో మీటర్ల పరుగులో రెండు బంగారు పతకాలు సాధించారు. సౌత్ సబ్ డివిజన్ నల్లపాడు పోలీసు స్టేషన్‌కు చెందని రాజశేఖర్ మూడు గోల్డ్ మెడలు పథకాలు, సాధించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కూడా మూడు మెడల్స్ సాధించారు. తెనాలి సబ్ డివిజన్ కొల్లిపర పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎఎస్ఐ సాంబశివరావు బంగారు పతకం సాధించారు. గుంటూరు ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం లక్ష్మణ్ హేమర్ త్రో క్రీడలో గోల్డ్ మెడలు సాధించారు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షహీద్‌ఉల్లా షాట్ పుట్ క్రీడలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది డ్యూటీలతోపాటు క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఇటివలే పెరేడ్ గ్రౌండ్స్ వాలీబాల్ కోర్టును ప్రారంభించామని జిల్లా పోలీస్ సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. పతకాలు సాధించిన పోలీసు అధికారులను సిబ్బందిని అభినందించి మరిన్ని క్రీడలలో పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ క్రైమ్స్ శ్రీనివాస్ రావు గారు, ఏఆర్ అడిషనల్ ఎస్పి కోటేశ్వరావు , ఏఆర్ డిఎస్పి చంద్రశేఖర్ , స్పెషల్ బ్రాంచ్ సిఐలు నరసింహారావు శ్రీనివాసరావు .వెల్ఫేర్ ఆర్ ఐ థామస్ రెడ్డి ,అడ్మిన్ ఆర్ ఐ రాఘవయ్య , ఆర్ ఐ , రాజారావు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు

పతకాలు సాదించిన క్రీడాకారులనుఅభినందిస్తున్నఎస్‌పి

చోరీ కేసుల్లో ఒకరు అరెస్టు

- నగదు, బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి వి.పోతురాజు

ప్రజాశక్తి - మేడికొండూరు

ఆమె ఒక సాధారణ మహిళ. చోరీలు చేయడమే వృత్తిగా ఎంచుకోని రెండు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలలో పట్టపగలు తాళాలు వేసిన ఇళ్లల్లో పలు చోరీలకు పాల్పడుతోంది. లక్షలాది రూపాయలు నగదు, వెండి, బంగారు వస్తువులు గుట్టు చప్పుడు కాకుండా చోరీ చేసి ఉడాయిస్తుంది. మంగళవారం మేడికొండూరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తుళ్లూరు డిఎస్‌పి వి పోతురాజు కేసు వివరాలను వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండ సమీపంలోని పెదకంచెర్ల గ్రామానికి చెందిన, అంగడి నిర్మల గుంటూరు సమీపంలోని లింగాయపాలెం ప్లాట్‌లలో తన భర్త, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంది. చీటీలు నిర్వహించి ఆర్థికంగా అప్పుల పాలయ్యింది. వాటిని తీర్చేందుకు దొంగతనాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటి దగ్గర నుండి కూలి పనుల కంటూ ఉదయం బయటికి వస్తుంది, గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా పెట్టుకొని గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడి దొంగతనం చేస్తుంది. మేడికొండూరు సర్కిల్ పరిధిలోని ఫిరంగిపురంలో కార్మిల్ పేటకు చెందిన చెందిన గజ్జల సునీత ఇంటిలో పట్టపగలు చోరీ జరిగింది. దీనిపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే తరహాలో మేడికొండూరులో కూడా మరో చోరీ జరిగింది. మేడికొండూరు సర్కిల్ పరిధిలోని, మేడికొండూరు, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయి. గుంటూరు ఎస్పీ ఆరిఫ్ ఆఫీస్ ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మంగళవారం ఫిరంగిపురం సొలస బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. పల్నాడు, గుంటూరు జిల్లాలలోని ఆయా పోలీస్ స్టేషన్లో మేడికొండూరు 2, ఫిరంగిపురం 4 అమరావతి 1, సత్తెనపల్లి రూరల్ 2,పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 9 కేసులు నమోదయ్యాయి. అన్ని కేసులలో రూ. 9.5 లక్షల నగదు, 190 గ్రాములు బంగారం, 200 గ్రాముల వెండి, చోరీకి గురైనట్లు డి.ఎస్.పి వి పోతురాజు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రూ.2.20 లక్షలు నగదు, 152 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండినీ రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన మేడికొండూరు సిఐ ఎండికే అల్తాఫ్ హుస్సేన్, ఫ్రింగ్ పురం ఎస్సై ఎం లక్ష్మీనారాయణ రెడ్డి, ఫిరంగిపురం ఏఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం. ఆంజనేయులు, ఏ. భాను ప్రకాష్, పిసిలు డేవిడ్, నజీర్, గంగరాజు, నాగమల్లేశ్వరి, శివాజీ, రమేష్‌లను ఎస్పి ఆరిఫ్ ఆఫీస్ అభినందించినట్లు డిఎస్‌పి పోతురాజు తెలిపారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వి.పోతురాజు

కమార్తెను చంపేశారంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ కుమార్తెను కట్టుకున్న భర్త, అత్తమామలు చంపారంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన సంఘటన పట్టణంలోని వినాయక హాస్పటల్ వద్ద చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..మాచవరం మండలంలానికి చెందిన షేక్ దరియా హుస్సేన్, షేక్ జాన్‌బిల కుమార్తె షేక్ ఫాతిమా(26)ను ప్రకాశం జిల్లా బలిగూరు మండలం వలాపల్లి గ్రామానికి చెందిన కాశీంవలికి ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. అయితే మంగళవారం ఉదయం ఫోన్ చేసి ఎవరో తమ కుమార్తె రోడ్డుపై ఉందని, వెంటనే వచ్చి తీసుకొని వెళ్లండి అని చెప్పటంతో అక్కడికి వెళ్లి తమ కుమార్తెను తీసుకొని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకొని రాగా డాక్టర్ అప్పటికే తమ కుమార్తె చనిపోయిందని తెలియజేశారు. అయితే తమ కుమార్తెకు అత్త సైదాబి, మామ సైదా, భర్త కాశీంవలిలు కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి ఇచ్చి చంపారంటూ బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై సీఐ ఎం. మధుసూధన్‌రావును వివరణ అడగ్గా పట్టణ పోలీస్ స్టేసన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదని తెలియజేశారు.

వృద్ధుడి దారుణ హత్య

- నరసరావుపేటలోని కర్ణాటక బ్యాంకు వద్ద ఘటన
- గుర్తుతెలియనివ్యక్తుల కత్తిపోట్లకు బలి
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- మసీదు నిర్మాణం నేపథ్యంలో వివాదమే కారణం?

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో పాత ఎల్.ఐ.సి రోడ్డులోని కర్ణాటక బ్యాంక్ వద్ద మంగళవారం సాయంత్రం వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని యువకులు కత్తితో వృద్ధుని కడుపులో మూడు పోట్లు పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.వృద్ధుని వెంట ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది.

వివరాలు పట్టణంలోని వరవకట్టకు చెందిన ఇబ్రహీం (73) కు స్థానిక వరవకట్టలో నిర్మితమవుతున్న మసీదు స్థలం విషయంలో, అదేవిధంగా పాత కాంప్లెక్స్‌లో ఉన్న 72 మందికి షాపులకు సంబంధించి వారికే షాపులు కేటాయింపులో తరచు ఏర్పడుతున్న వివాదాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గతంలో సఖ్యత కుదిరింది. మసీదు నిర్మాణం నేపథ్యంలో నిర్మాణ పనుల నిలుపుదల చేయాలని, షాపుల నిర్మాణం ప్లాన్ ప్రకారం కాకుండా ఒక వర్గానికి చెందిన వారి ఇష్టానుసారం నిర్మిస్తున్నారని, మసీదు నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని కోర్టు స్టే ఇచ్చింది. ఈ విషయమై టిడిపికి ఇబ్రహీం కీలకంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానం నేపథ్యంలో హత్య జరిగినట్లు సమాచారం. ఇబ్రహీం తన సన్నిహితుడు రహమత్ అలీ మంగళవారం సాయంత్రం కర్ణాటక బ్యాంక్ దగ్గర ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో ఇబ్రహీంను విచక్షణా రహితంగా కడుపులో పొడవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అడ్డువెళ్లిన రహమత్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. హత్యా సమాచారం తెలుసుకున్న డిఎస్పీ చిన విజయ భాస్కం రావు,1వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితిని సమీక్షించారు. తీవ్ర గాయాలు పాలైన రహమత్ అలీని చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తర లించారు. ఇబ్రహీం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో శవాగారానికి తరలించారు. దాడి చేసిన వ్యక్తులు వైసిపికి చెందిన వారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహమత్ అలీ వారి వివరాలను పోలీసులకు తెలియజేశాడు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రహమత్ అలీని మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తర లించారు.

ఈ హత్యతో నాకు సంబంధం లేదు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వృద్ధుడు ఇబ్రహీం హత్య విషయంలో వైసిపికి గాని తనకు గాని ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హత్య జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మసీదు నిర్మాణ విషయంలో ముస్లింల మధ్య జరుగుతున్న చిన్న చిన్న వివాదాలే ఈ హత్యకు దారి తీశాయని, గతంలో ఇరువర్గాలతో మాట్లాడి సఖ్యత కుదిర్చామని చెప్పారు. ఇబ్రహీం హత్యలో వైసీపీకి చెందిన వారు ఉంటే వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయడంతో పాటు కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటా మన్నారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహించే సంస్కృతి తనది కాదని, వృద్ధుడిని చంపి రాజకీయాలు చేయాల్సిన అవసరం తనకు లేదని స్పష్టం చేశారు.

హత్య దుర్మార్గం : అరవిందబాబు

పల్నాడు జిల్లాలో పోలీస్ యంత్రాంగం మొద్దు నిద్ర పోవడం వల్లే హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. మంగళవారం సాయంత్రం వైసిపి వర్గీయుల చేతిలో గాయపడి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన రహమత్ అలీని ఆయన పరామర్శించారు. హత్యకు గురైన ఇబ్రహీం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చదలవాడ మాట్లాడుతూ గాయపడిన వ్యక్తి హత్యకు పాల్పడిన వైసిపికి చెందిన వ్యక్తుల పేర్లు చెప్పాడని, తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మృతుడి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని చెప్పారు.

కృష్ణా నదిలో ఈతకు దిగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

కనకదుర్మమ్మ వారధి సమీపంలో కృష్ణా నదిలో సరదాగా ఈతకు దిగి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి కోరాడ వెంకట్ (17) మృతి చెందాడు. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం తాడేపల్లి మహానాడుకు చెందిన కోరాడ వెంకట్, అతని తమ్ముడు కోరాడ సాయి, మరో ఐదుగురు స్నేహితులతో కలిసి వారధి సమీపంలోని నదిలో ఉన్న శివాలయం సమీపంలోని నీటి పాయ వద్దకు వెళ్లారు. పాయ చిన్నదిగా ఉండటంతో నదిలో దిగుదామన్న ఆలోచన యువకులకు వచ్చింది. ముందుగా వెంకట్ నది పాయలోకి దిగి కొట్టుకుపోతూ కేకలు వేయడంతో తమ్ముడు సాయి, మరో యువకుడు కాపాడడానికి యత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఆ ప్రాంతంలో 20 అడుగులు లోతు ఉంటుందని గజ ఈతగాళ్లు చెబుతున్నారు. కళ్లముందే తమతో వచ్చిన మిత్రుడు నీటిలో మునిగిపోవడంతో అతని తమ్ముడు సాయితో పాటు మిగతా మిత్రులు పెద్దగా కేకలు వేయడంతో గజ ఈతగాళ్లు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వెంకట్ నదిలో మునిగిపోవడంతో పోలీసులు వచ్చేంత వరకూ ఎదురుచూశారు. తాడేపల్లి పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారమందించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది నదిలోకి దిగి వెంకట్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న యువకుడి మృతితో మహానాడులో విషాదఛాయలు అలముకున్నాయి.

మురుగువాగులో మహిళ మృతదేహం

ప్రజాశక్తి- ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామ శివారులో గల మురుగువాగులో సుమారు 40 నుండి 45 సంవత్సరాలు వయసు కలిగిన మహిళ మృతదేహం లభ్యమైనది. ఆమె ఒంటిపై ఆకుపచ్చ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించినది, ఎత్తు సుమారు 4 అడుగుల 8 అంగుళాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వేమవరం గ్రామ వీఆర్వో యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసినవారు ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి 9440900876కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	39,401
మిర్చి ఎగుమతి	:	38,794
మిర్చి నిల్వ	:	11,451

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 26,500
నెం.5	14,500- 23,000
273	14,000 - 22,300
341	10,000 - 26,000
4884	12,000 - 16,000
సూపర్ 10	11,000 - 25,500
నాన్ ఎసి	
తేజ	9,500 - 23,000
బడిగి	10,500 - 27,000
దేవనూరు డీలక్స్	10,000- 26,000
తాలుకాయలు	4,000 - 13,500
ఎసి	
334	10,000 - 25,000
నెం.5	17,500 -17,500
341	21,000 - 21,000
తేజ	10,000 - 21,500
బడిగి	18,000 - 24,000
దేవనూరు డీలక్స్	16,000- 20,000
తాలుకాయలు	4,500 - 10,000

జెఇఇ, నీట్ విద్యార్థులకు మొబైల్ యాప్

ప్రజాశక్తి-గుంటూరు : ప్రభుత్వ జూనియర్ కాలేజిలో గణిత అధ్యాపకునిగా పనిచేస్తున్న పులుగు దీపక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెఇఇ, నీట్-2023 ఉచిత శిక్షణలో 28 మంది విద్యార్థులకు యువ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీసు సొసైటీ సౌజన్యంతో మొబైల్ యాప్‌ను ఉచితంగా అందచేశారు. ఈ మొబైల్ అండ్ ట్యాబ్ అప్లికేషన్ విద్యార్థులకు సబ్జెక్ట్సను, వారికి టెస్ట్ సిరీస్‌ను, మెలకువలకు ఎంతోగానో ఉపయోగపడతాయని దీపక్ తెలిపారు. ఆఫ్‌లైన్ తరగతులు పండరీపురం 3వ లైన్‌లో నిర్వహిస్తున్నామని, ఎవరైనా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఈనెల 27 నుండి మరో ఉచిత నీట్, జెఇఇ-2023 బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు ఆఫ్‌లైన్‌లోగానీ, లేదా 7780150751 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి-ఈపూరు : డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారి ఆదేశాల మేరకు ఈపూరు సెబ్ స్టేషన్ వారి దాడులలో సీజ్ చేసిన వాహనాలను నేడు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు సెబ్ ఎస్సై వీరవల్లి సైమన్ తెలిపారు. 21 ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆసక్తి గలవారు వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించాలన్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు : సిఎం జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం వైసిపి నాయకులు స్థానిక పాత సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద కేక్‌ను చేశారు. 70 మంది పేద వృద్ధులకు చీరలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.శ్రీనివాస్ ద్వారా అందజేశారు. నాయకులు జి.రమేష్, జె.శ్రీనివాసరావు, బి.అప్పారావు, డి.పోతురాజు, ఆరోగ్య కార్యకర్త కరీం పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ విజయవాడ 2 వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

ఐ.పి. 49/2022

బిట్వీన్:
కొణతం బాను శివరామ నాగరాజు
మరియు వగైరాలు ...పిటీషనర్స్
మరియు
గొల్లపూడి శ్యామ్ సుందరం మరియు వగైరాలు
...రెస్పాండెంట్సు
టు
5వ రెస్పాండెంటు: కాలేపల్లి పార్వతి,
భర్త గంగాధరరావు, డోర్.నెం:6-29-12/ఏ,
బ్రహ్మంగారిగుడి దగ్గర, కొరిటిపాడు, గుంటూరుజిల్లా.

పై నెంబరు దావా ది.4-1-2023న మీ యొక్క హాజరు నిమిత్తము వాయిదా అయి ఉన్నది. సదరు పై కోర్టు వారి ఎదుట వాయిదా రోజున ఉదయం గం.10-30ని॥లకు మీరు స్వయముగా గాని లేదా లాయరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనగలరు. లేనిచో పై దావా మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.
విజయవాడ,
ది:19-12-2022

ఇట్లు
కొణతం చంద్రశేఖరరావు,
అడ్వకేటు అండ్ నోటరీ,
కృష్ణలంక, విజయవాడ-13

పోస్టాఫీసు సేవింగ్ పాసుపుస్తకం పోయినవి

వి.యస్.ఆర్ ఆంజనేయులు పాటిబండ్ల, తండ్రి. లక్ష్మీనారాయణ అను నేను పోస్టాఫీసులో సేవింగ్ అకౌంట్‌ని కలిగి యున్నాను. (అకౌంట్ నెం.4450914870). నా యొక్క సేవింగ్ అకౌంట్ పుస్తకాన్ని ది.15-12-2022 తారిఖున బ్రాడీపేట 6/13 మా యింటి నుండి జిరాక్స్ నిమిత్తం శంకర్‌విలాస్ సెంటర్‌కు బైకుపై వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావునా ఏవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.

వి.యస్.ఆర్.ఆంజనేయులు,
పాటిబండ్ల,
9848086863.

Notice
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR
E.P.No:290/2016 in O.S.No: 37/ 1993
Between:
Manne Sowmya ….D.H.R
AND
Pyneni Venkata Ramaiah(Died) & Others
….J.D.R's
To,
J.D.R No.3: Kidambi Janakiram,
S/o.Radha Krishnamacharyulu
@Vatapatrasai
J.D.R.No.5: Kidambi Raghuram,
S/o.Radha Krishnamacharyulu
@Vatapatrasai
Both are R/o.2/2 Arundelpet, Guntur
J.D.R No.8: Rayapati Chilkayamma,
W/o.Narasimha Rao, Presently
R/o.Flat No:110, 7/2 Chandramouli Nagar,
Guntur City.

పై నెంబరు E.P లో JDR No-3, 5 & 8 అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఆర్డర్ 21 రూల్-34 నోటీసులు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:24-01-2023న ఉ.గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును.
లేనియెడల మీ పరోక్షమందు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియపర్చుడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:24-01-2023

చాగంటి నరసింహ రెడ్డి,
పసుపులేటి శ్రీనివాస రావు,
డి.హెచ్.ఆర్ తరపు అడ్వకేట్స్,
5/1 కన్నావారి తోట, గుంటూరు.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM CHIEF JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD
MVOP.NO. 165 OF 2022
Between:
Pasula Yadamma
….. Petitioners
And
The APSRTC and others
….Respondents
To,
V Srinivasa Rao S/o Rama rao
Aged about: 52 years,
Occ: Driver of RTC bus
bearing No. AP 29 Z 3307
R/o Chowdavaram, Guntur west
Mandal, Guntur city– 522005
……. R.3

Please take Notice that the above named Petitioner filed above OP against you and other for Compensation, Praying that the Hon'ble Court for grant of compensation in favor of the petitioner. The Hon'be Court posted the above case on 30/12/2022 at 10:30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence

(BY ORDER OF COURT)
M/s. P. CHANDRA MOULI
SMT. ARUNDATHI
Advocates,
H.NO. 8-1-58/5,
BANGARU ENCLAVE,
JYOTHINAGAR,
KARMANGHAT,
HYDERABAD

మాట్లాడుతున్న టిడిపి నేత జీవి ఆంజనేయులు

'హత్యా రాజకీయాలకు తెరదించాలి'

టిడిపి నేతల మాచర్ల పర్యటనకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి- నరసరావుపేట

మాచర్లలో బ్రహ్మారెడ్డి టిడిపి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పిన్నెల్లికి ఓటమి భయం పట్టుకుందని, మాచర్లలో టిడిపి నేతలను భయపెట్టాలనే ఉద్దేశ్యంతో హత్యా రాజకీయాలకు తెరలేపారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు ఆరోపించారు. మాచర్ల ఘటనకు కారకులైన వైసిపి నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేయాలని, గాయపడిన టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయాలని, మాచర్ల పర్యటనకు రాష్ట్ర, జిల్లా టిడిపి నేతలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రవి శంకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవి మాట్లాడుతూ టిడిపి కార్యాలయాన్ని, టిడిపి సానుభూతిపరుల ఇళ్ళు వాహనాలను ధ్వసం చేయటం పిరికిపంద చర్య అన్నారు. బాధితులను పరామర్శించటానికై రాష్ట్ర, ఉమ్మడి గుంటూరు జిల్లా టిడిపి నాయకుల బుధవారం పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఎస్పీని కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత అనుమతిస్తామని చెప్పారని అన్నారు. ఎటువంటి ఘటనలకు తావు లేకుండా పోలీస్ రక్షణ కల్పించాలని,అమాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ఘర్షణల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఎలా పర్యటించారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి ఎం.దారునాయక్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ (రాము),తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, విభిన్న ప్రతిభ వంతుల టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పూదోట సునీల్, బండారుపల్లి సత్య నారాయణ,జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, టిడిపి పట్టణ అధ్యక్షులు కడియాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

28న టెన్నిస్‌బాల్ క్రికెట్ జిల్లాస్థాయి జట్ల ఎంపిక

ప్రజాశక్తి - యడ్లపాడు

ఈ నెల 28న టెన్నిస్‌బాల్ క్రికెట్ జిల్లాస్థాయి జట్ల ఎంపిక ప్రక్రియను చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సాంబశివరావు తెలిపారు. అండర్-19 బాలురు, బాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ఎంపికలు వేర్వేరుగా ఉంటాయన్నారు. ఈ ఎంపికను చిలకలూరిపేట పట్టణం పురుషోత్తమపట్నం ఎస్‌పీటీఆర్‌కేఎం ఇంగ్లీష్‌మీడియం స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు సెల్‌నం: 99661 22055 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని అన్ని గ్రామాల సచివాలయం సిబ్బందికి ఎడిజి (సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు)కు సంబంధించి అవగాహన, సూచనలు జారీ చేశారు. ఇతర ప్రభుత్వ పథకాలపై కూడా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అబివృద్ధి అధికారి వై.హనుమారెడ్డి, పిఆర్-ఆర్‌డి విస్తారణాధికారి బి.వరూధిని, అంగన్వాడీ సూపర్ వైజర్లు జోజమ్మ, వాణి పాల్గొన్నారు.

రెవెన్యూ, పోలీస్ సమస్యలే ఎక్కువగా వస్తున్నాయ్

- పరిష్కారంలో జాప్యం చేయొద్దు : పల్నాడు కలెక్టర్
- అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ప్రభ్యుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల పనులు, అంతర్గత అధికారుల సమన్వయ కార్యకలాపాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులు, మండల అధికారులతో జిల్లా అధికారులు సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించడానికి జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఆన్ లైన్‌లో బియాండ్ ఎస్.ఎల్.ఏ కనిపిస్తున్న వాటిపై ఆర్డీ వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కార నివేదిక అందజేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో ఎక్కువగా రెవిన్యూ, వ్యవసాయం, పోలీస్ వంటి వాటికి సంబంధించిన సమస్యలు వస్తున్నట్లు చెప్పారు. రానున్న శుక్రవారం నుంచి ప్రతి సచివాలయంలో మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించి, సిబ్బంది పని తీరు, రికార్డుల పరిశీలన, నోటీస్ బోర్డులో ఏర్పాటు, విధుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, క్షేత్రస్థాయికి వెళ్ళిన ఉద్యోగులు, సెలవులో ఉన్న ఉద్యోగులు వివరాలను పొందు పంచాలని ఆదేశించారు. వచ్చే వారంలో సిఎస్ టు సీఎం తో పాటు ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు తప్పనిసరిగా సచివాలయాల తనిఖీకి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రతి సచివాలయాన్ని పూర్తి స్థాయిలో ఆధునీ కరించడం, పరిశుభ్రతను పాటిం చటం వంటి చర్యలపై పూర్తిస్థాయి దృష్టి సారిం చాలని, సస్టైన బుల్ డెవలప్‌మెట్ గ్రోత్ (ఎస్‌డిజి) కార్య క్రమాన్ని పల్నాడు జిల్లాలో అమలు జరిగేలా చూడాలని సూచించారు. జగనన్న భుహక్కు, భూ రక్ష ఈ సర్వే, పిఎం ఎవై పథకం పనులు, ప్రభుత్వ భవన నిర్మాణాలు, సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాలు, మొదలైన అంశాలపై సమీక్షించారు. వ్యవసాయ శాఖలో ప్రభుత్వం నుంచి ఎటువంటి కొత్త విధానం వచ్చినా, మిగతా జిల్లాల కన్నా ముందుగా పల్నాడులో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖలు సమన్వయంతో రైతులకు మెరుగైన సేవలందించేలా చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎటువంటి దుర్ఘ టనలు జరిగిన ఆ మండలాధికారులు అంతా సమన్వయంతో జరిగిన ఘటనపై ఒకే తరహా నివేదికను పరిశీలన చేసిన తర్వాత జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, పాత సామాగ్రి, పేపర్లు, ప్రభుత్వ రికార్డులు, పాత వాహనాలను తప్పనిసరిగా సేక రించి, ప్రభుత్వ అనుమతుల ద్వారా వేలం నిర్వహించాలన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలను, ముందస్తు అనుమతి తీసుకొని తొలగించాలని చెప్పారు. సమావేశంలో జెసి శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియలో ఏడు పిహెచ్‌సిలు

జిల్లాలో నాడు -నేడు కార్యక్రమం కింద నూతనంగా, మరమ్మతులు చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రుల పనులపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ సూచించారు. మంగళవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఆర్ అండ్ బి, ఏపీ ఎంఐడిసి సహాయ ఇంజనీర్లతో నాడు -నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా మంజూరైన ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అచ్చంపేట మండలంలోని మాదిపాడు, దాచేపల్లి మండలంలోని గామాలపాడు, క్రోసూరు మండలంలోని దొడ్లేరు ,పిడుగురాళ్ల మండలంలోని పిల్లుట్ల, నూజెండ్ల మండలంలోని అయినవోలు, రెంటచింతల మండలంలోని గోలి, నరసరావుపేట మండలంలోని పమిడిపాడులలో పనులపై సమీక్షించారు. స్థల సేకరణ అనంతరం టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని అధికారులు వివరించారు. పమిడిపాడు వద్ద ల్యాండ్ డిస్ప్యూటీ విషయమై పరిష్కరించే విధంగా చర్యలు చేట్టాలన్నారు. గతంలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరికరాలకు, విద్యుత్ బకాయిలు విషయమై తగు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా లోని ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనుల వివరాలు, ఈపూరు, విజయపురి సౌత్, పెదకూరపాడులో నిర్మిస్తున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, అమరావతిలలోని నాలుగు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అవసరమైన మరమ్మతులను త్వరితగతంగా చేపట్టాలని ఆదేశించారు. అమ రావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డీప్ ఫ్రీజర్లు, విజయపురిసౌత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పోస్టుమార్టం గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఈఈ రాజా నాయక్, ఎపి ఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, డిసిహెచ్‌ఎస్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా భూ సర్వే పూర్తి చేయాలి

జిల్లాలో భూముల రీ సర్వే జరుగుతున్న మండలాలలో మరిన్ని ఎక్కువ టీములు ఏర్పాటు చేసి వారం రోజుల లోపల గ్రౌండ్ ట్రూతింగ్ పనులలో పురోగతి వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియపై ఏరోజుకారోజు నివేదికలను సిద్ధం చేసి సంబంధిత అధికారుల ద్వారా అందజేయాలన్నారు. అనం తరం ఏపీ ఆన్‌లైన్ కేస్ మానిటరింగ్ సిస్టం పై సమీక్షిస్తూ కోర్టు కేసులకు సంబంధించి పెండింగ్ లేకుండా ఎప్పటి కప్పుడు కౌంటర్ దాఖలు చేసి, ఆయా విషయాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. చుక్కల భూముల విషయంలో పెం డింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని, 22 (ఏ) భూ సంబంధిత విషయాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎప్పటి కప్పుడు రెవెన్యూ డివిజన్ అధికారులు త్వరితగతిన పరి శీలించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారి నాగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

గుంతల మయం

వాహనచోదకుల్లో భయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గుంతలో ఇరుక్కున్న ఆటో

పట్టణంలోని నరసరావుపేట సెంటర్ నుంచి కళామందిర్ సెంటర్ వయా రిజిస్టర్ కార్యా లయం సెంటర్ మీదుగా వెళ్లే రహదారి మోటార్ సైకిళ్లు, ఆటో రిక్షాలు ఇతర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనచోదకులు ఏమాత్రం ఏమర పాటుగా ఉన్నా అంతే సంగతలు..గుంతల్లో పడి ప్రమాదాల పాలవడం ఖాయం. ఆంజనేయ స్వామి దేవాలయం మలుపు వద్ద, రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా వున్న రోడ్లు గుంతలు మయంగా ఉన్నాయి.ప్రధానంగా పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ల గుంత ఇక్కడ ఉంది. తాగునీరు పంపే కొన్ని కనెక్షన్లకు మూత ఉద్దేశ్యంతో గుంత తవ్వి అలాగే వదిలివేశారు. ఈ విషయమై అక్క ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఇదే మార్గంలో ఒక ఆటో ఇటీవల ప్రమాదాకిని గురెన సంఘటనే ఇందుకు ఉదాహరణ. ప్రయాణికులతో వెళుతున్న ఆటో వెనుక టైరు ఒక్క సారిగా గుంటలో పడిపోవడంతో ప్రయాణికుడు ఆటోలో నుంచి రోడ్డుపై పడటంలో గాయాలపాలయ్యాడు. అదే మాదిరి నిత్యం బైకులపై వెళ్లే వ్యక్తులు తరచు ప్రమాదాలకు గురవుతూన్నారు. మున్సిపల్ అధికారులు కనీసం రద్దీ రహదారులపై ప్రమాదాలను గుర్తించే సిగ్నల్స్ కానీ, ప్రమాదకర గుంతలకు సిమెంట్ మూతలు వేయ టం లాంటి ప్రయత్నం కానీ చేయడంలేదని వాహన చోదకులు విమర్శిస్తున్నారు. గుంతల రహదారులకు మర మ్మతులు చేయా లని, వాహన చోదకులు ప్రమాదాల పాలవ్వ కుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టణంలో ప్రదర్శనను నిర్వహిస్తున్న జనసేన నాయకులు

మంత్రి అంబటి రాంబాబు రాజీనామా కోసం ర్యాలీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రమాదవశాత్తూ మృతి చెందిన తురక అనిల్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలోమంగళవారం పట్టణంలో నిర సన ప్రదర్శన చేశారు. ఈ మేరకు అనిల్ కుమార్ కు న్యాయం చేయాలని బ్యానర్ ను చేతబూని పార్టీ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు నిరసనలో పార్టీ నాయకులు బోనెబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వర రావు , తవిటి భావన్నారాయణ,శ్రీను, సిరిగిరి మణి కంఠ తదితరులు పాల్గొన్నారు .

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందిచేలా చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గుర్తించిన ప్రమాదకరమైన గర్భిణీలకు సుఖ ప్రసవాలు జరిగేలా ప్రాథమిక కేంద్రం వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని , ప్రసవ తేదికి వారం ముందు నుండే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాలతో అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్న గర్భిణీల ప్రసవాలకు మెరుగైన వైద్య సేవల కోసం తెనాలిలోని జిల్లా ఆసుపత్రికి, గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు మ్యాపింగ్ చేసి ప్రసవాలు జరిగే వరకు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణం పూర్తి అయిన అర్బన్ హెల్త్ సెంటర్లను వెంటనే ప్రారంభించాలన్నారు.నిర్మాణాలు పూర్తి అయిన భవనాలు వినియోగంలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించే అధికారుల జీతాలలో కోత విధించి, ప్రస్తుతం ఉన్న భవనాలకు అద్దె చెల్లించడం జరుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమానికి అవసరమైన మందులు సకాలంలో సరఫరా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, డియం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుమయాఖాన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హనుమంతరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి 5 ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యం

నీతిఆయోగ్ సిఇఒ పరమేశ్వర నాయక్

2047 నాటికి ఐదు ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యం దిశగా వికాస్ భారత్‌ను చేరుకోవాడానికి కృషి చేయాలని నీతి అయోగ్ సిఓఓ పరమేశ్వర నాయక్ సూచించారు. మంగళవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో 2023 జనవరిలో నిర్వహించనున్న సెకండ్ నేషనల్ కాన్ఫరెన్స్ ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో, జిల్లా కలెక్టర్లతో కేంద్ర నీతి ఆయోగ్ సిఇఓ పరమేశ్వర నాయక్, వైస్ ఛైర్మన్ సుమన్ భేరి, క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గుబా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఏపీ నుండి కాకినాడ, అనకాపల్లి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నంద్యాల, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. నీతీ ఆయోగ్ సిఇఓ పరమేశ్వర నాయక్ మాట్లాడుతూ 2047 నాటికి ఐదు ట్రిలియన్ల ఎకానమీ లక్ష్యం దిశగా వికాస్ భారత్‌గా చేరుకోవడానికి జిల్లా ఒక అభివృద్ధి కేంద్రంగా ఉన్న వనరులను ఉపయోగించుకొని ఆర్థికాభివృద్ధి పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సిపిఓ శేషశ్రీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

రైల్వే లైనుకు భూసేకరణపై జెసి పరిశీలన

ప్రజాశక్తి - ఫిరంగిపురం :గుంటూరు నుండి గుంతకల్ రైల్వే డబుల్ లైన్ కోసం మండలంలోని నుదురుపాడులో 11 మంది రైతుల నుండి 2.52 ఎకరాలను సేకరించగా ఆయా భూముల రికార్డులను జెసి రాజకుమారి మంగళవారం పరిశీలించారు. భూముల్లో గృహాలు నగులురు వ్యాపార దుకాణాలు కలిగి ఉండడంతో వారికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల పట్టాలను జెసి అందించారు. భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం పూర్తిగా పొందిన తర్వాతే నివాసాలను ఖాళీచేసి అప్పగించాలని బాధితులకు జెసి సూచించారు. ఆర్‌డిఒ ఎం.ప్రభాకర్‌రెడ్డి, తహశీల్దార్ డి.పద్మ నాభుడు, ఆర్‌ఐ కోటేశ్వరరావు, విఆర్‌ఒ శివకోటేశ్వరరావు, సర్పంచ్ జి.నాగమల్లేశ్వరి చౌడయ్య పాల్గొన్నారు.

ఎన్ని చట్టాలొచ్చిన మహిళలపై ఆగని దాడులు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

దేశంలో మహిళలపై జరుగుతున్న హింస దాడులకు వ్యతిరేకంగా, మహిళాల హక్కులు మానవ హక్కులుగా గుర్తించాలని కోరుతూ మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రంలో సింహాద్రి సుమ అధ్యక్షతన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్ అరుణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన మహిళల మీద దాడులు అత్యాచారాలు ఆగటం లేదన్నారు. ప్రతి 15 నిమిషాలకు మహిళల మీద ఏదో రూపంలో దాడులకు గురౌవుతుందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ సంఘటన జరిగి నిర్భయ చట్టం తీసుకొచ్చి పది ఏళ్లయిన కానీ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాల కారణంగా నిర్భయ చట్టాన్ని నిరుగారుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో మహిళలను ప్రేమ వివక్షత రూపేనా మహిళలను ముక్కలు ముక్కలుగా వధిస్తున్న తీరు చాలా బాధాకరమైన విషయమన్నారు. అధికారానికి వస్తే మద్యం దశలవారీగా నియంత్రిస్తానన్న సిఎం జగన్మోహన్ రెడ్డి దశలవారీగా మద్యం షాపులు పెంచుకుంటూ 15 సంవత్సరాల పిల్లలను కూడా తాగుడుకు బానిసలుగా చేసి మహిళల మీద దాడులకు కారణమవుతున్నాడని విమర్శించారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా మగ పిల్లలు, ఆడపిల్లలు సమానం అనే ధోరణి అలవాటు చేస్తే మహిళల మీద వివక్షత అనేది భవిష్యత్తులో ఉండవని దానికోసం మహిళ సంఘాలు కృషి చేస్తున్నాయని అన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై పోరాటాల్లో మహిళలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మహిళలకు జరుగుతున్న దాడులకు నిరసనగా మహిళలు ప్రదర్శన చేసి నిరసన తెలియజేశారు. మహిళా సంఘం నాయకులు కోడూరు సుజాత, గౌర బత్తుల లక్ష్మి, ప్రజాసంఘాల బాధ్యుడు వి దుర్గారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, ఐద్వా నాయకులు

ఆత్మకూరులో ఐద్వా ప్రదర్శన

కూచిపూడి నృత్య ప్రదర్శనలో డాక్టర్ సంకీర్తన ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

కూచిపూడి నృత్య ప్రదర్శనలో డాక్టర్ సంకీర్తన ఉత్తమ ప్రతిభ కనబరిచిందని స్కూట్స్ కేర్ సిఇఓ డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. విజయవాడలో ఈనెల 17న ఘంటసాల మ్యూజిక్ కాలేజిలో ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజిక్ డ్యాన్స్ అసోసియేషన్ నిర్వహించిన నృత్య ప్రదర్శనలో సూట్స్‌కేర్ నెట్‌వర్క్‌లో క్లినికల్ డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సంకీర్తన పాల్గొందని తెలిపారు. 547 మంది నృత్య కళాకారులు 15 నిముషాల పాటు చేసిన ఈ కూచిపూడి నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్, లిమ్కాబుక్, ఆసియా బుక్, ఇండియా రికార్డ్, గోల్డేన్ బుక్, బ్రిటీషు వరల్డ్‌తోపాటు మొత్తం 10 రికార్డులు సృష్టించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంకీర్తనను సోమశేఖర్‌రెడ్డి శాలువాతో సత్కరించి, మెమెంటో బహుకరించారు. సన్మాన కార్యక్రమంలో స్కూట్స్‌కేర్ డైరెక్టర్ డాక్టర్ ప్రిన్స్ అభిషేక్, న్యూ ఎలైట్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవల్లిక, పెమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.దినేష్ పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పోటీల్లో తెలుగు రాష్ట్రాల హవా

- **బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాల వర్షం**
- **రెజ్లింగ్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కైవసం**

ప్రజాశక్తి-ఎఎన్‌యూ,విజయవాడ అర్బన్

మూడో రోజు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జాతీయ పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మూడో రోజు బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజిలింగ్ పోటీల్లోని పలు విభాగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు పసిడి పతకాల దక్కాయి. వెయిట్ లిఫ్టింగ్ అండర్- 14 బాలికల విభాగంలో ఏపికి మూడు బంగారు పతకాలు వరించాయి. 44, 58, 63 కేజీల బాలికల కేటగిరీలలో ఏపీ బాలికలు విజయదుందుభి మోగించారు. 48, 53 కేజీల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ బాలికలే మూడుస్థానాలను సైతం కైవసం చేసుకున్నారు. ఏపికి చెందిన వంకునవత్ కళ్యాణి 56 పాయింట్లతో 44 కిలోల కేటగిరిలో పసిడి పతకాన్ని సాధించింది. 58 కేజీల కేటగిరిలో ఏపికి చెందిన పి.అంజలి బంగారు పథకాన్ని కైవసం చేసుకుంది. 63 కేజీల విభాగంలో పి.లోకేశ్వరి దివ్యకళ గోల్డ్ మెడల్ సాధించింది. ఈ రెండు వరుస విభాగాల్లో సుజాత, పి.స్వప్న చివరి స్థానంలో నిలిచారు. పాయింట్ల పట్టికలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ 184 పాయింట్లతో ఓవరాల్ టీమ్ ఛాంపియన్‌ను కైవసం చేసుకుంది. 130 పాయింట్లతో ఏపి రన్నరప్‌గా నిలిచింది.

బాక్సింగ్‌లో ఆంధ్రప్రదేశ్ బాలికల బంగారు 'పంచ్'లు

బాక్సింగ్ అండర్- 14 బాలికల కేటగిరిలో ఆంధ్రప్రదేశ్ కు 6 పసిడి పతకాలు వరించాయి. 30- 32 కేజీల విభాగంలో ఎల్. మహాదేవి. 32 - 34 కేజీల కేటగిరిలో కె.తులసీ, 34 - 36 విభాగంలో వై.హేమలత, 40-42 విభాగంలో సీహెచ్.కీర్తన, 42-44 కేటగిరిలో బి. స్రవంతి. 44-46 విభాగంలో జె.లతా మాధురి పసిడి పతకాలు సాధించారు. 38-40 కేటగిరిలో బి.గ్రేషి మాధురి వెండి పతకం కైవసం చేసుకుంది. అండర్ -14 బాలుర బాక్సింగ్‌లో కేవలం రెండు కాంస్య పథకాలతో ఏపీ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 34-36 విభాగంలో ఎస్.శ్రీ చరణ్ దొర, 36-38 కేటగిరిలో టి. వర్షిత్ కుమార్‌లు కాంస్య పతకాలను గెలుచుకున్నారు.ఇక బాక్సింగ్ అండర్- 19 బాలికల కేటగిరిలో అయితే ఆంధ్రప్రదేశ్ 5 బంగారు పతకాలు సాధించింది. 42-45 కేటగిరిలో కె.గంగాభవాని, 45-48 విభాగంలో బి. సలోమి కుమారి, 51-54 కేటగిరిలో పి.శ్యామలా దేవి, 54-57 విభాగంలో కె.లోకేశ్వరి, 69-75 కేటగిరిలో పి.గుణ సుందరి పసిడి పతకాలను సాధించారు. 60-64, 64-69 విభాగాలలో ఎ. అమూల్య, డి.కీర్తి ప్రసన్నలు సిల్వర్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారు. 48-51, 57-60 కేటగిరిల్లో జి.సత్య గౌరి, ఈ.వర్షితలు కాంస్యాలను దక్కించుకున్నారు. బాక్సింగ్ అండర్- 19 బాలురి కేటగిరిలో కేవలం 3 కాంస్య పతకాలు మాత్రమే ఆంధ్రప్రదేశ్ సాధించుకోగలిగింది. 42-46, 46-49, 64-69 విభాగాలకు గానూ కె.ప్రవీణ్ కుమార్, ఎం.మోహన్ రావు, జె.లోవ రెడ్డి వరుసగా కాంస్యాలను పొందిన జాబితాలో నిలిచారు.

ఆంధ్రప్రదేశ్ కే అండర్-14 బాలికల ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఓవరాల్ ఛాంపియన్ షిప్

రెజ్లింగ్ క్రీడలో అండర్-14, అండర్-19 విభాగాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బాలికల హవా కొనసాగింది. స్వర్ణ పతకాలతో తెలుగు రాష్ట్రాల బాలికలు సత్తా చాటారు. ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ అండర్- 14 విభాగంలో 165 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్‌గా అవతరించింది. 155 పాయింట్లతో తెలంగాణ రన్నరప్‌గా నిలిచింది. ఫ్రీ స్టైల్ రెజ్లింగ్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ అండర్- 19 విభాగంలో 195 పాయింట్లతో తెలంగాణ ఛాంపియన్‌గా గెలిచింది. 160 పాయింట్లతో రన్నరప్‌ను ఆంధ్రప్రదేశ్ సొంతం చేసుకుంది. వాలీబాల్ బాలుర ఫస్ట్ సెమీ ఫైనల్ మ్యాచ్ లో తెలంగాణపై ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది. వాలీబాల్ బాలికల సెకండ్ సెమీ ఫైనల్ మ్యాచ్ లో ఆంధ్రప్రదేశ్ పై తెలంగాణ గెలిచింది.

విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో జరుగుతున్న ఈఎంఆర్‌ఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే పరిశీలించారు. క్రీడలన్నీ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. అక్కడ క్రీడాకారులకు వసతులు, అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు ఏ విధమైన లోటు రాకుండా చూడాలని ఆదేశించారు.

అథ్లెటిక్స్ ఫలితాలు:

డిస్కస్ త్రో: అండర్-19 గ్రూప్-బి లో ఛత్తీస్ గఢ్‌కు చెందిన మనీష్ కుమార్ సింగ్ 33.16 మీటర్లతో ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్-19 గ్రూప్-బిలో మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ సెమారియా 24.89 మీటర్లతో ద్వితీయ స్థానంలో నిలిచాడు.అండర్-19 గ్రూప్‌లో తెలంగాణకు చెందిన కేతావత్ అనిల్ 24.17 మీటర్లతో తృతీయ స్థానంలో నిలిచాడు.**హర్డిల్స్:** గ్రూప్-19 100 మీటర్ల హర్డల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పి.శ్రీవల్లి 20.37 సెకన్లతో ప్రథమ స్థానంలో నిలిచారు. తెలంగాణకు చెందిన కారం కల్యాణి 21.02 సెకన్లతో ద్వితీయ స్థానంలో నిలిచారు ఛత్తీస్ గఢ్ కు చెందిన కవిత దేహారి 21.08 సెకన్లతో తృతీయ స్థానంలో నిలిచారు.**పోల్ వాల్ట్:**గ్రూప్-19 పోల్ వాల్ట్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మడకం నాగలక్ష్మీ 1.60 మీటర్ల దూరంతో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎం. జ్యోతిక 1.60 మీటర్ల దూరం స్థానంలో నిలిచారు.**బాడ్మింటన్ (అండర్-14) బాలురు సింగిల్స్**: బాడ్మింటన్ అండర్-14 విభాగంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన టి. చరణ్ శ్రీ హర్షకు స్వర్ణంలభించింది. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన బేదో యామేకు రజత పతకం, హిమాచల్ ప్రదేశ్ కు చెందిన విక్రాంత్ ఠాకూర్‌కు కాంస్య పతకం లభించింది.

కాల్వ కట్టపై పూల మొక్కలు నాటించండి

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని ఎన్ఎస్పి కాలువ కట్టకి ఇరువైపులా జాజిమల్లెలు, సంపంగి పూల మొక్కలు నాటాలని ఎమ్మెల్యే బోల్లా బ్రహ్మనాయుడు మున్సిపల్ అధికారులకు, కాంట్రాక్టర్ను ఆదేశించారు. మంగళవారం స్థానిక 31 వ వార్డులోని పెరుమళ్ళపల్లి మేజర్ కాలువ కట్టపై మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్ఎస్పి కాలువ దుర్గంధంతో ఉండేదని నాడు అభివృద్ధి చేసి దుర్వాసనను పారద్రోలామన్నారు. విష్ణు కుండినగర్, రెడ్డినగర్ ప్రాంతవాసులకు మంచి అహ్లాదకం మైన వాతావరణ న్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కాలువ కట్టపై ఉత్త చెట్లు నాటడం వలన ఉపయోగం లేదని, జాజి మల్లెలు, సంపంగి పూల మొక్కలు నాటితే సువాసనలు వెద జల్లుతాయని,ఆ మొక్కలు నాటించాలని ఆదేశించారు.

వాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలో వాలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణం, రూరల్ గ్రామాలకు చెందిన వాలంటీర్లు అంతా అసత్య ఆరోపణలతే తమ మీద వార్తలు రాస్తున్నారని, పచ్చ మీడియాను వెంటనే తొలగించాలంటూ ఆందోళనకు దిగారు. ఆర్అండ్బి బంగ్లా నుంచి ర్యాలీ నిర్వహించుకుంటూ ఐలాండ్ సెంటర్ వద్దకు చేరుకొని ఐలాండ్ సెంటర్లో మానవమారం నిర్వహించారు. అక్కడి నుంచి పోలీస్ స్టేసన్ మీదుగా ఆర్అండ్బి బంగ్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవచేసే తమపై వేగులంటూ అసత్య కథనాలు రాయటం సరికాదని వారు తెలియజేవారు.

వైవి ఆంజనేయులుతో పుట్టా మహేష్ యాదవ్ భేటీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి నియో జకవర్గం మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు, టిటిడి మాజీ చైర్మన్, మైదుకూరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు, పుట్టా మహేష్ యాదవ్ మోతడక లోని వై వి ఆంజనేయుల నివాసంలో మంగళవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురు ఏకాంతంగా కొద్దిసేపు ముచ్చటించారు. భీమినేని వందనాదేవి, చౌట శ్రీనివాస రావు,జి ఆళ్ళ సాంబయ్య, కటకం రామకృష్ణ, ఆళ్ళ అమరేశ్వరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, రావిపాటి దేవేంద్రరావు,పోట్ల ఆంజనేయులు, అన్నదాసు వెంకటస్వామి, మర్రి గోపి,గద్దె అప్పారావులను వై వి ఆంజనేయులు పేరు పేరున పరిచయం చేశారు. అనంతరం సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ళ ,నకరికల్లు,రాజుపాలెం, సత్తెనపల్లి రూరల్,సత్తెనపల్లి పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసితో మాట్లాడారు. పుట్టా మహేష్ యాదవ్ని వైవి ఆంజనేయులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు ,క్లస్టర్ బాధ్యులు, టిడిపి అభిమానులు శాలువాతో సత్కరించి చిరు జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా వనమహోత్సవం

ప్రజాశక్తి-విజయపురి సౌత్

విజయపురి సౌత్ లోని ఏపీఆర్జేసీ జూనియర్ కళాశా నందు 71వ వన మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో 20 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి బూడిద శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ప్రిన్సిపల్ చందు ఆంజనేయులు, విజయపురిసౌత్ రేంజ్ ఆఫీసర్ బిజివి శ్రీనివాసులు, కలసి సుమారు రెండువందల మొక్కలు నాటారు. విద్యార్థులకు 100 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ప్రథమ బహుమతిని జి.పవన్కుమార్ (ఎంఇసి సెకండ్ ఇయర్), ద్వితీయ బహుమతిని జి.రాజు (ఎంపిసి సెకండియర్) కైవసం చేసుకున్నాడు, విజేతలకు ట్రోఫీలను ఎంపిపి, రేంజ్ ఆఫీసర్, కళాశాల ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్.ఎస్.ఓ శ్రీనివాస్, గోపీచంద్, ఖాసీం, బీట్ ఆఫీసర్స్, కళాశాల అధ్యాపకులు రంగాచార్యులు, చంద్రశేఖర, శ్రీను నాయక్, నాగేంద్ర, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజశేఖర్, పుల్లయ్య, ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడమే కాదు.. పరిరక్షించాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలంలోని నందిగామలో ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళ వారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంబటి మాట్లాడుతూ పచ్చదనం పెరిగేందుకు, వాయు కాలుష్యం తగ్గించేందుకు మొక్కలు ఎంతగానో దోహదపడతా యన్నారు. మొక్కలు నాటమే కాకుండా వాటి పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో, పొలాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు.

కార్యక్రమంలో మం డల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమ రావు, గుంటూరు జిల్లా రైతు సలహా మండలి సభ్యులు కె.విజయభాస్కర్రెడ్డి, ప్రజాప్రతి నిధులు, అధికారులు ఉన్నారు.

శివరాత్రి నాటికి రక్తనిధి కేంద్రాన్ని ప్రారంభించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా లో బ్లడ్ సెంటర్ ను మహా శివరాత్రి నాటికి ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో పల్నాడు జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు శివ శంకర్ లోతేటి ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఆపదలో ఉన్న వారికి బ్లడ్ సెంటర్ ద్వారా రక్తం సకాలంలో అంద చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే ఢిల్లీ రెడ్ క్రాస్ సొసైటీ సుమారు రూ 4కోట్ల విలువైన బ్లడ్ సెంటర్ ఎక్విప్ మెంట్ జిల్లాకు చేరినట్లు ప్రతినిదులు తెలిపారు. బ్లడ్ సెంటర్ పనుల పురోగతి నీ జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ శరత్ బాబు, కోశాధికారి మురళీ కష్ణ, రెడ్ క్రాస్ ప్రతి నిధులు శ్రీనివాస గుప్తా, రాము, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రంగారావు, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఏ.పి.ఎం.ఎస్. ఐ.డి.సి డి.ఈ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో తొలి సెమీక్రిస్మస్ సంతోషం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 25 వ తేదీన క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తొలిసారిగా పల్నాడు జిల్లా ఏర్పాటు అయిన తర్వాత సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరికీ అడ్వాన్స్ హ్యాపీ క్రిస్టమస్ తెలియజేశారు. ఓల్డ్ టెస్టమెంట్ ను న్యూ టెస్టుమెంటును పాక్షికంగా చదవడం జరిగిందని తద్వారా చాలా విషయాలు తెలిశాయన్నారు. ప్రపంచంలో క్షమాగుణం వ్యాపించింది క్రీస్తు బోధన వల్లే అని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా సంతోషంగా ఉం డాలని కోరారు. క్రీస్తు బోధనలు ప్రపంచానికి చాలా అవ సరమన్నారు. తొలుత క్రిస్మస్ సందర్భంగా భారీ కేకును కట్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి: జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రేమ...శాంతి...సమాధానం...ఇదే క్రిస్మస్ సందేశమని సీయోను లూథర్ చర్చి పాస్టర్లు రెవ.పి.స్వరూప్ కుమార్, జి.దయానందం లు పేర్కొన్నారు. జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో పరివర్తన మానసిక ఆశ్రమ పాఠశాల్లో జరిగిన సెమి క్రిస్మస్ వేడుకలో వారు మాట్లాడారు.

అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేశారు.అన్నదానం నిర్వహించారు విశ్రాంత ఉపాధ్యాయులు కేబీఆర్జే.ప్రసాద్ చిన్నారులకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గోదా జాన్ పాల్, సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్కుమార్, న్యాయ వాది బాదినీడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-వినుకొండ

ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వినుకొండ డిపో వద్ద అధ్యక్షుడు డిజి విన్సెంట్తో కలిసి 50 మంది సభ్యులు గ్యారేజీ మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి ప్లే కార్డ్స్ చేత పూని ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అధ్యక్షులు ఎస్.కె కాజా, జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె హరిబాబులు మాట్లాడుతూ ఓ టి డి ఓ అలవెన్స్, మూడు నెలల ఎరియర్స్తో పాటు మొదలైనవి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, ఎం.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పోటి పరీక్షకు ఎంపికైన గీతమ్ విద్యార్థులు

ప్రజాశక్తి-వినుకొండ

గత నెల 16వ తేదీన పట్టణంలోని గీతమ్స్ హైస్కూల్లో నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంతన్ వారి పరీక్ష పోటీలలో గీతమ్స్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షలలో ఎం దుర్గా గణేష్, 6వ తరగతి, కె జగన్ మోహన్ రెడ్డి, 7వ తరగతి, వి యశస్విని, కె వైష్ణవ రెడ్డి, డివి మణికంఠ , 7వ తరగతి , వై. మేఘనారెడ్డి, ఎం ప్రణతి , టి సాయి దేవి ప్రియ, 8వ తరగతి, వై శ్రీలేఖ 9వ తరగతి , విద్యార్థులు 2023 ఫిబ్రవరి 12న జరిగే జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ సందర్భంగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా సిఎం జగన్మోహన్రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వెసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడి రెక్కల దేవదాసు ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకలలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి రాబోయే తరాలకు దిశా నిర్దేశం చేయగల బలమైన నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కేక్ కట్ చేసి 20 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక షాలోమ్ చర్చ్ సంఘ కాపరి గోళ్ళ మూడి సుధీర్ కుమార్ , వివిధ సంఘాల పాస్టర్లు, 24 వార్డు కౌన్సిలర్ అచ్యుత శివ ప్రసాద్, గుంటూరు ఆశీర్వాదం, కూచిపూడి జానుబాబు, మనకే సంగీతరావు మహేష్ పాల్గొన్నారు.

'బిసిలను ప్రలోభ పెడుతున్న అధికార, ప్రతిపక్షాలు'

ప్రజాశక్తి-రొంపిచర్ల

రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిసిలను ప్రలోభాలకు గురి చేస్తుందని బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం బిసి సంక్షేమ సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిమ్మరాజు మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం ఏ రాజకీయ పార్టీకి చెందినది కాదని అన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు పోటిపడుతూ బిసిలను ఓటు బ్యాంకుగా ఉపయోగించేందుకు దాడులకు పాల్పడటం జరుగుతుందని అన్నారు. బిసిలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలకు ఏ రాజకీయ పార్టీ సముచిత స్దానం ఇస్తుందో ఆ పార్టీకి మద్దతు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో బిసిల ఓట్లు ఎక్కువగా ఉంటాయో రాజకీయ పార్టీలు ఆ నియోజకవర్గమును బిసిలకు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం మండల నాయకులు చక్రవరం సత్యనారాయణరాజు, ముక్కడాల శ్రీనివాసరావు, పిడెం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం ఇంధన పొదుపు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేయర్ కావటి మనోహార్ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు
భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపుగా వాడాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మహిళాకళాశాలలో నిర్వహించిన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు మెయర్ బహుమతులు అందజేసి మాట్లాడారు. మనకు సహజ సిద్దంగా లభించే ఇంధనం పొదుపుగా వాడకపోతే భావి తరాలకు ఇంధనం దొరకదని, కావున ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపుగా వాడాలన్నారు. ఇంధనానికి ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాలన్నారు. ఇంధన పొదుపుపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్ విఆర్ .జ్యోత్స్నకుమారి, వైసిపి నాయకులు గులాం రసూల్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ జె.సుబ్బాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్య కార్మికులకు మేయర్ దుప్పట్లు పంపిణీ

సిఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగవారం సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తెలుకుంట్ల హనుమాయమ్మ యోగేశ్వరరావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, డివిజన్ ఇంచార్జులు కంతేటి శ్యాంశేకర్, ఖాజా మొహిద్దీన్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న వీసీ పి. రాజశేఖర్

వర్సిటీలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఎఎన్‌యు
ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. వర్సిటీ విసి పి రాజశేఖర్, ఏపీ ఎస్ఎస్‌డిసి సలహాదారు చల్ల మధుసూదన్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈ శ్రీనివాసరెడ్డి అధ్యాపకులు రవిశంకర్ రెడ్డి, రవికుమార్ తదితరులు రక్తదానం చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. రెక్టార్ పి వరప్రసాద్ మూర్తి ,రిజిస్టార్ బి కరుణ పర్యవేక్షించారు

విటిజెఎం, ఐవిటిఆర్ డ్రిగ్రీ కళాశాల డీన్‌గా వెంకట నరసింహం నియామకం

ప్రజాశక్తి -మంగళగిరి
నగరంలోని విటిజెఎం, ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల డీన్‌గా హైకోర్టు న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్బిట్రేటర్ దామర్ల వెంకట నరసింహం నియమితులయ్యారు. మంగళవారం జరిగిన కళాశాల పాలకమండలి సమావేశంలో ఆయనను మండలి సభ్యులు ఎన్నుకున్నారు. దామర్ల వెంకట నరసింహం విటిజెఎం, ఐవిటిఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివి ఇదే కళాశాలకు డీన్ ఆఫ్‌ద కాలేజీగా నియమితులవడం విశేషం.

స.హ.చట్టం బోర్డులు ఏర్పాటు కోసం వినతి

ప్రజాశక్తి- పెదనందిపాడు
మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సభ్యులు మంగళవారం తహశీల్దార్ మహబూబ్ సుభానికి వినతి పత్రం అందజేశారు. కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునే విధంగా అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, జె. రమేష్, ఐనగంటి మౌనిక , దార తిరుమలరావు పాల్గొన్నారు.

పంట నష్ట అచనాలను త్వరగా పూర్తి చేయాలి

పొలాలను పరిశీలిస్తున్న సిహెచ్ తిరుమల దేవి

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్
మండలంలోని కసకర్రులో పంట నష్ట గణన కార్యక్రమాన్ని పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ తిరుమలాదేవి మంగళవారం పరిశీలించారు. పొన్నూరు, చేబ్రోలు మండలాలలోని అన్ని గ్రామాలలో పంట నష్ట గణన త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత గ్రామ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు వ్యవసాయ అధికారి డి. వెంకటరామయ్య పాల్గొన్నారు.

తెనాలి:ఈనెల 9 నుంచి 12 వరకు కురిసిన భారీ వర్షాలలో నష్టపోయిన మినుము, వరి పంటల అంచనాలను సిద్ధం చేయాల్సిన విధానాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ్ సాగర్ అవగాహన కల్పించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల ఇంచార్జ్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ 33 శాతానికి పైగా దెబ్బతిన్న పొలాలకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. తహశీల్దార్ కే రవిబాబు మాట్లాడుతూ ప్రతి ఆర్‌బికెలో రోజుకు 500 క్వింటాలకు తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, హార్టికల్చర్ అసిస్టెంట్లు, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో గో కపామృతం తయారీ శిక్షణ కల్పిస్తున్న యూనిట్ సభ్యులు

పొదుపు సంఘాల మహిళలకు శిక్షణ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
గో కపామృతం తయారీ పై పొదుపు సంఘాల మహిళలకు మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ గో కపామృతం వాడటం వలన భూమి సారవంతంగా మారుతుందని, మొక్కలు కూడా ఏపుగా పెరుగుతాయని తాడేపల్లి మండల యూనిట్ సభ్యులు కె శ్రీదేవి తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోని సారవంతమైన పంటలు పండించి, ఆరోగ్యంగా జీవించాలని ఆమె తెలిపారు. సిఆర్‌పిలు, ఐబిఐసి ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, పొదుపు సంఘాల మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీమాస్త్రం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్
మంగళగిరి మండలం చిన్నవడ్లపూడి, చిన్నకాకాని గ్రామలలో అన్ని రకాల పంటలపై ఉండే శత్రు పురుగుల గుడ్లు లార్వాలను నాశనం చేసే నీమాస్త్రం తయారీ పై డ్వాక్రా మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో 200 లీ నీమాస్త్రం తయారు చేయించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు . ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ ఎం. రాహేల్ రావు, ఐసిఆర్ పి శివగంగా, శివకుమారి,సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి -మేడికొండూరు
మానవ మనుగడకు జీవనాధారం మొక్కలేనని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచడం అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పురస్కరించుకొని మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఒక మొక్కను నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. వాతావరణ మార్పులను అరికట్టేందుకు మొక్కలు ఎంతో తోడ్పడతాయన్నారు. మనం పీల్చే గాలి ఆక్సిజన్ అని, ప్రపంచంలో ఏ జీవి అయినా ఆక్సిజన్‌ను పీల్చుకుని కార్బన్ డై ఆక్సైడ్ వదిలేస్తుందని కాని ఒక్క చెట్టు మాత్రమే పగటి పూట కార్బన్ డై ఆక్సైడ్ తీసుకుని ఆక్సిజన్‌ను వదులుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి కరుణకుమార్, ఇంచార్జ్ ఎంపిడిఓ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -మంగళగిరి
ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి బస్టాండ్ ఆవరణలో ఎర్రబ్యాడ్జీలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. 11వ పిఆర్‌సి అమలు చేయాలని, ఏఏఎస్ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న లీవ్ ఎన్కాష్మెంట్ పరిష్కరించాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి సాంబశివరావు, కే వీరయ్య, పి సత్యనారాయణ, మనోరందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిపై కుక్క దాడి

ప్రజాశక్తి- మంగళగిరి
విద్యార్థిపై కుక్క దాడి చేసి గాయ పరిచిన సంఘటన మంగళవారం మంగళగిరి పోలేరమ్మగుడి వీధిలో వాణి స్కూల్ వద్ద చోటు చేసుకుంది. స్థానిక ద్వారకా నగర్‌కు చెందిన విద్యార్థి బి హేమంత్ పై కుక్క దాడి చేసి గాయపరిచింది. విద్యార్థి హేమంతు స్కూల్ నుంచి బయటికి వస్తుండగా రోడ్డుపై కుక్క వెంటపడి విద్యార్థి బొడ్డుపై కరిచింది. నగరపాలక సంస్థ అధికారులు నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి తండ్రి రామకృష్ణ కొరారు.

నాడు-నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్
మండలంలోని నిడుబ్రోలు జడ్‌పి హైస్కూల్‌లో జరుగుతున్న నాడు -నేడు పనులను మంగళవారం మండల విద్యాశాఖాధికారి రుద్రపాటి శోభచంద్ పరిశీలించారు. పాఠశాల తరగతి గదులపనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత ప్రమాణాలు రుచి చూశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి స్థలంలోకి వచ్చేలా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి
తమ ఇంటి స్థలంలోకి వచ్చే విధంగా కళావేదిక నిర్మాణ పనులు చేస్తున్నారని తాడేపల్లి క్రిస్టియన్‌పేటకు చెందిన ఇసుకపల్లి రజిత తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. గతంలో ఇదే ప్రాంతంలో నిర్మాణాలు మొదలుపెట్టినప్పుడు అధికారులను ఆశ్రయించగా అనధికార నిర్మాణమని తేల్చి కూల్చివేశారని ఆ ఫిర్యాదులో బాధితురాలి పేర్కొంది. రాజకీయ అండతో మళ్లీ తమ స్థలంలోకి కళావేదిక వచ్చే విధంగా నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అదేమని అడిగితే, తమ కుటుంబసభ్యులపై దాడి చేయడంతో పాటు కులం నుంచి వెలేస్తామంటున్నారని వాపోయింది. పోలీసులు, ఎంటిఎంసి అధికారులు తమకు న్యాయం చేయాలని కోరింది.

వరిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు ములకా శివ సాంబి రెడ్డి

పంట నష్టం అంచనాలపై లోపభూయిష్ట ఉత్తర్వులు

ప్రజాశక్తి - తెనాలి

పంట నష్టం అంచనాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు లోపభూయిష్టంగా ఉన్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మండలంలోని తేలప్రోలు, నేలపాడు ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి పొలాలను నాయకులు మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం చివరి గింజ వరకూ ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. 33 శాతానికి పైగా నష్టపోతేనే పంట నష్టం అంచనాలు వేయాలని అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను ఆయన తప్పుపట్టారు. ఈ-క్రాప్ నమోదు సరిలేక, సిసిఆర్ కార్డులు లేక రైతులు పూర్తిగా నష్ట పోతున్నారని తెలిపారు. అధిక వర్షాలకు నిలువున ఉన్న పైరు, పడిపోయిన పైరు కూడా రైతులు నష్టపోయారని, ఎకరాకు దాదాపు 10 బస్తాలు దిగుబడి తగ్గుతోందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రైతులను పూర్తి స్థాయిలో ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహబూబ్ ఖాన్, గంజి ఏసుబాబు షేక్ బాజీ, పి.రోశయ్య, షేక్ గౌస్‌బాషా పాల్గొన్నారు.

డ్వాక్రాల వద్ద అక్రమ వసూళ్లపై ఐద్వా ఫిర్యాదు

ఎవరికీ రూపాయి కూడా ఇవ్వనవసరం లేదన్న టిఎంసి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

టిఎంసి నాగేశ్వరమ్మకు వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు

పట్టణంలోని స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళల వద్ద నుండి సమైక్యల రిసోర్స్ పర్సన్, ఆర్పీలు వేలాది రూపాయలు అక్రమ వసూళ్ల చేశారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మెప్మా టిఎంసి నాగేశ్వరమ్మను స్థానిక మెప్మా కార్యాలయంలో మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జ్యోతి, జి.ఉమశ్రీ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు రుణమాఫీలు వచ్చినప్పుడు, వడ్డీ లేని రుణాల డబ్బులు వచ్చినప్పుడు, లోన్లు వచ్చినప్పుడు ఆయా సమాఖ్యల ఆర్‌పిలు తమకు పర్సంటేజీలు (డబ్బులు) ఇవ్వాలని డ్వాక్రా గ్రూపుల మహిళలను డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నారని చెప్పారు. గ్రూపులను ఆన్‌లైన్ చేయాలని, తీర్మానాలు రాయాలనే పేరుతో, ఆర్పీలకు 0.5 డబ్బులు ఇవ్వాలని ఆర్పీలు ఎవరి స్థాయిలో వారు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కూలి పనులకు వెళ్లి పొదుపు చేసుకుంటున్న నిరుపేద మహిళల నిరక్షరాస్యతను ఆసరా చేసుకుని వసూలు చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పైగా ఇలా వసూలు చేసిన డబ్బులు ఉన్నతాధికారులకూ ఇవ్వాలి కాబట్టి డబ్బులివ్వ కుంటే రుణమాఫీ డబ్బులు, లోన్లు, వడ్డీ లేని రుణాలు డబ్బులు, తదితరాలు ఆపేస్తామంటూ బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. అక్రమ వసూళ్లను నిలిపేసి విచారణ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మెప్మా టిఎంసి నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ విషయాలు తన దీష్టికి రాలేదని, ఇక మీదట జరగనివ్వబోమని హామీనిచ్చారు. గ్రూపులలో ప్రతి సభ్యులు సేవా రుసుం రూ.100 ప్రతి సంవత్సరం జనవరిలోనే ఆర్పీలకు ఇవ్వాలని, అంతకుమించి ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పని లేదని అన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు డి.విమల, ఐ.అరుణ, ఆయేషా, ఫాతిమా, టి.లక్ష్మీప్రసన్న, జి.నాగలక్ష్మి, పి.శివపార్వతి, ఎం.రమాకుమారి, సిఐటియు నాయకులు జి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

రేపు రాజధాని పారిశుధ్య కార్మికుల చలో విజయవాడ

సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని పారిశుధ్య కార్మికులు గురువారం విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో నిరసన తెలపనున్నారని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి, అధ్యక్ష కార్యదర్శులె చెరుకూరి సుశీల, రాచూరి వేణు, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తుళ్లూరులో ఒ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జనవరి నుంచి కొత్త టెండర్లను పిలిచి రాజధాని పారిశుధ్య కార్మికులను కొనసాగించాలని, కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, పారిశుధ్య కార్మికులు ఉద్యోగులనే పేరుతో నిలిపివేసిన సామాజిక పింఛనును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, మున్సిపల్ మంత్రి, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని కార్మికులకు పని భద్రత కల్పించాలని కోరారు. స్పందించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల తొలగింపుకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనకు రాజధాని గ్రామాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. రాజధానిలోని 29 గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జనవరి నుండి పని లేదని, వారికి జీతాలు చెల్లించలేమని, వేరే పనులు చూసుకోవాలనిసి ఆర్‌డిఎ అధికారులు చెప్పడం అన్యాయమని, 2017 నుంచి పని చేస్తున్న కార్మికులకు కొత్త సంవత్సరం కానుకగా పనుల నుండి తొలగించబోతున్నారా..? అని వారు ప్రశ్నించారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

గాంధీ పార్కులో అధికారులకు సూచనలు చేస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

తాగునీటి సమస్య తలెత్తకుండా సచివాలయాల వారిగా ఎమినిటి కార్యదర్శులు, ప్రతిరోజూ పరిశీలిస్తూ రోజువారీ నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, నాడు-నేడు పనులు, హౌసింగ్ తదితర అంశాలపై జిఎంసి ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం సమీక్షించారు. లీకులు, కలుషిత నీటి సరఫరా గుర్తించిన వెంటనే సంబంధిత ఎఇల ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి లేవాలని ఎమినిటీ కార్యదర్శులకు సూచించారు. పెద్ద పలకలూరు రోడ్డులో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ మీడియన్స్ ఫైల్ వెంటనే సిద్ధం చేసి పంపాలని, ట్రాఫిక్ ఐలాండ్స్ అభివృద్ధిపై ఎఇల వారీగా అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో గోతులను ఎప్పటికప్పుడు ప్యాచ్ వర్క్ చేయాలని, పట్టణ ఆరోగ్య కేంద్రాలను నెలాఖరకు పూర్తి చేయాలని చెప్పారు. మీటర్ లేకుండా తాగునీటిని వినియోగించుకుంటున్న కమర్షియల్ సంస్థలకు తక్షణమే మీటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా స్తంభాలు ఉండి, లైట్లు లేకపోతే వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఇ భాస్కర్, ఇఇలు శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్క్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గాంధీ పార్క్ అభివృద్ధి పనులు రోజువారీ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయకుంటే కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ అధికారులపైనా చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గాంధీ పార్క్ అభివృద్ధి పనులు, శ్రీనగర్‌లో నిర్మించిన సిసి డ్రెయిన్‌ను కమిషనర్ పరిశీలించారు. గాంధీ పార్క్‌లో నిర్దేశిత గడువు ప్రకారం పనులు జరగకపోవడంపై కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేసి, త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం శ్రీనగర్‌లో నూతనంగా రూ.22 లక్షలతో నిర్మించిన 318 మీటర్ల సిసి డ్రెయిన్ నాణ్యతను పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్లు ఎం.భారతి, ఎం.శ్రీవల్లి, ఎస్‌ఇ భాస్కర్, ఇఇలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డిఇఇలు శ్రీనివాసరెడ్డి, కల్యాణరావు, ఎడిహెచ్. రామారావు, ఎఇలు సేతుబాబు, రవికిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో

ప్రభుత్వ కాలేజి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

తమ కళాశాల విద్యార్థినిలు విద్యతోపాటు కళలు, క్రీడలు, ప్రతిభ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చాటుతూ కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేస్తున్నారని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్ జోత్స్న కుమారి అన్నారు. స్థానిక హిందూ కళాశాల ఆధ్వర్యంలో 'టీఎస్ రామారావు మెమోరియల్ అంతర్ కళాశాలల వృక్షశాస్త్ర (క్వెస్ట్)-2022 పోటీల్లో భాగంగా నిర్వహించిన క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినిలు మొదటి స్థానం కైవసం చేసుకుని ఓవరాల్ ఛాంపియన్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినులను, వారికి శిక్షణిచ్చిన అధ్యాపకులను కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ భాస్కరరావు, అధ్యాపకులు సంతోషికుమారి, డి.ఉమా, బి.జాస్మిన్ పాల్గొన్నారు.

15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రం గేట్ల మూత

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

కోర్టుల్లో ఉద్యోగాల కోసం బుధవారం నుండి 2వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారథి కొన్ని సూచనలు పేర్కొంటూ మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. పరీక్షకు 15 నిముషాల ముందే ఆయా కేంద్రాల గేట్లు మూసేస్తారని, అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి అభ్యర్థులను లోపలికి అనుమతించబోరని తెలిపారు. పరీక్షకు వచ్చేవారు హాల్‌టిక్కెట్‌తోపాటు మరో గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, అభ్యర్థి ఫొటో గుర్తింపు కార్డు కాపీ, లేదా ఐడి సాఫ్ట్ కాపీని తెస్తే దానిపై టిసిఎస్, ఇన్విజిలేటర్‌గా నియమితులైన జ్యుడీషియల్ ఆఫీసర్ హాజరు పట్టీలో నమోదు చేసి అభ్యర్థిని అనుమతించినట్లు ఆమోదం తెలిపి, అభ్యర్థి హాజరు తుది ధ్రువీకరణకు లోబడి ఉంటుందని వివరించారు. హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్‌లో సమస్యలెదురైన అభ్యర్థులు 0863 2372752 ల్యాండ్ లైన్ ఫోన్ ద్వారా లేదా ఇమెయిల్ ఐడి : helpdesk - hc.ap@aij.gov.in ద్వారా తెలపాలని సూచించారు. స్టెనో, టైపిస్టు, డ్రైవర్ పోస్టులకు సంబంధించి కంప్యూటర్ ఆధారిత పరీక్ష అనంతరం ఉత్తీర్ణులైన వారి నిష్పత్తి ప్రకారం స్కిల్ టెస్టుల నిర్వహణ తేదీని అభ్యర్థులకు తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు. స్టెనో, టైపిస్టు, డ్రైవర్ పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష మాత్రమే తుది పరీక్షగా పరిగణిస్తారని తెలిపారు.

కిట్స్‌లో పవర్ ఐబి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

మైక్రోసాఫ్ట్ పవర్ ఐబి డేటా ఎనలిస్ట్ అసోసియేషన్ అనే అంశంపై కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి సిఎస్‌డి విభాగంలో సదస్సు మంగళవారం ప్రారంభించారు. ఐసిటి అకాడమీ సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కామాట్చి దేవి లీడ్ టెక్నికల్ ట్రైనర్‌గా ఉన్నారు. వివిధ యూనివర్సిటీలు, కళాశాల నుండి ఫ్యాకల్టీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ డేటా సైన్స్‌లో వచ్చే వివిద అప్లికేషన్లను అధ్యాపకులు అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాశ్ పాల్గొన్నారు.